క్లుప్తంగా

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



టేకుమంద గ్రామంలో భగవద్గీతపై ప్రచారం చేస్తున్న సభ్యులు

బంగారుపాళెం: మండలంలోని టేకుమంద గ్రామంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలపై బంగారుపాళెం కమిటీ–2 సభ్యులు ప్రచారం చేశారు. కమిటీ అధ్యక్షుడు ధనంజయ మాట్లాడుతూ, సమాజంలో కులమతాలను రూపుమాపి, ప్రజల మధ్య నెలకొన్న అసమానతలను తొలగించడానికి భగవద్గీత పఠనం చేయాలన్నారు. సర్వమతాలకు దేవుడు ఒక్కడేనని ప్రజల్లో దైవభక్తిని పెంపొందించడానికి దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దుర్యోధన వధతో ముగిసిన మహాభారతం



దుర్యోధన వధ సన్నివేశం

పూతలపట్టు: మండలంలోని మిట్టూరు బాట గంగమ్మ దేవస్థానం వద్ద నిర్వహించిన మహాభారత యజ్ఞం ఆదివారం దుర్యోధన వధతో ముగిసింది. ఇందులో దుర్యోధన వేషధారి యుద్ధ సన్నివేశాలు, పాటలు, పద్యాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. 16 రోజుల పాటు వెంకటేశ్వర నాట్య మండలి వారు నాటకాన్ని ప్రదర్శించారు. రంగంపేట క్రాస్‌కు చెందిన పోతునాయుడు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దుర్యోధన వధ నాటకంలో గ్రామానికి చెందిన కిరణ్‌కుమార్, తారకరాముల నాటకం వేసి ప్రజలను ఆకట్టుకున్నారు.

వరసిద్ధునికి విరాళం

కాణిపాకం(చిత్తూరు రూరల్): కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి ఆదివారం ఓ కుటుంబం విరాళం అందించింది. విజయవాడకు చెందిన దుర్గా రామకుమార్ అన్నదానానికి రూ. 50,116, గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.50,116 విరాళం అందజేశారు. ఈ నగదును కుటుంబ సమేతంగా ఆలయ అధికారులకు అందజేశారు. వారికి అధికారులు స్వామి దర్శనం కల్పించి వేదపండితుల ఆశీర్వచనాలు అందేలా చూశారు.

సరెండర్ సెలవు బకాయిలు మంజూరు చేయాలి

చిత్తూరు కలెక్టరేట్ : ఉపాధ్యాయులకు రావాల్సిన సరెండర్ సెలవు బకాయిలను ప్రభుత్వం మంజూరు చేయాలని ఆపస్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాలాజీ కోరారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఆదివారం ఆపస్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు దీర్ఘకాలికంగా ఉన్న బకాయిలను మంజూరు చేయాలన్నారు. జిల్లా అధ్యక్షులు మంజునాథగుప్తా మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. తమ సంఘం జాతీయ భావజాలం దేశభక్తితో దేశం కోసం పనిచేస్తోందని తెలిపారు. అనంతరం పలు అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు హనుమంతరెడ్డి, రాధాకృష్ణ, రెడ్డిరాజేశ్వరి పాల్గొన్నారు.

ఆరిమాను గంగమ్మ జాతర



గంగమ్మ ఆలయంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లె పంచాయతీ గొల్లపల్లె వద్ద వెలసిన శ్రీఆరిమాను గంగమ్మ జాతర ఆదివారం వైభవంగా జరిగింది. స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ పూజల్లో పాల్గొన్నారు. గ్రామస్తులు ఆయనను సాదరంగా ఆహ్వానించారు. నియోజకవర్గ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని, వర్షాలు బాగా కురవాలని గంగమ్మను వేడుకున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా పుష్పపల్లకి

బైరెడ్డిపల్లె : మండలంలోని కడపనత్తం సమీపంలో వెలసిన నల్లగుండ్రాయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి పుష్పపల్లకి ఊరేగింపు నేత్రపర్వంగా జరిగింది. విద్యుద్దీపాలు, రంగు రంగుల పుష్పమాలికతో సుందరగా అలంకరించిన పల్లకిలో శ్రీఅలివేలుమంగమ్మ, పద్మావతి సమేత శ్రీనల్లగుండ్రాయస్వామి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. పురవీధుల్లో పుష్పపల్లకి ఊరేగింపు వైభవంగా సాగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

వలంటీర్లపై రాబందుల కన్ను

- అవ్వాతాతలు గుర్తుపెట్టుకోండి
- ఓటు బలంతో వాటిని తరిమేద్దాం
- వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి



బహిరంగసభలో మాట్లాడుతున్న విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్రంలో వలంటీర్ వ్యవస్థపై కొన్ని రాబందులు కన్నేశాయని వాటిని ఓటు బలంతో తరిమేద్దామని వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి అన్నారు. ఆదివారం కో–ఆప్షన్ సభ్యులు ఆను, నాయకులు ఇమ్రాన్ ఆధ్వర్యంలో స్థానిక రామ్‌నగర్‌కాలనీ, చుట్టు పక్కల ప్రాంతాల నుంచి ముస్లింలు, బైక్, కార్ల ర్యాలీ నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయానికి చేరుకొని విజయానందరెడ్డికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవ్వా తాతలకు, దివ్యాంగులకు ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు ఇవ్వకూడదంటూ టీడీపీ ఎన్నికల కమిషన్ ద్వారా అడ్డుకుంది. ఇంత దుర్మార్గమైన బుద్ధి ఉన్న చంద్రబాబు అవ్వాతాతలకు పింఛన్లు రూ.4 వేలు ఇస్తానంటే ఎవరైనా నమ్ముతారా అని ప్రశ్నించారు. ఇలాంటి రాబందులను ఓటు బలంతో తరిమికొడదాం అని పిలుపునిచ్చారు. నగరంలో ముస్లింలు, క్రైస్తవులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోట లాంటి వారన్నారు. ఎస్‌ఆర్‌సీ నుంచి విముక్తి పొందాలంటే వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలో రావాలని చెప్పారు. నగరంలో దాదాపు 9వేల కుటుంబాల్లో 20 వేల మంది ముస్లింలు ఉన్నారని చెప్పారు. గత మూడేళ్లుగా వారికి తన వంతు సహకారంగా రంజాన్ తోఫా అందిస్తున్నామన్నారు. 46 మసీదుల నిర్వహణ కోసం ఒక్కొక్క మసీదుకు రూ.50 వేల చొప్పున అందజేశామన్నారు. స్థానిక షాదీమహల్‌ను ఆధునీకరించి వసతులు కల్పిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో మైనారిటీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

సంతపేటను అభివృద్ధి చేస్తా

నగరంలోని సంతపేట కరుమారియమ్మన్ ఆలయం నుంచి నాయకులు గోపి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం విజయలక్ష్మికాలనీలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో విజయానందరెడ్డి మాట్లాడారు. వలంటీర్లపై టీడీపీ నాయకులు కక్షకట్టారన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయం వలంటీర్లు పింఛన్ ఇచ్చేవారన్నారు. దాన్ని కూడా ఇవ్వకుండా టీడీపీ నాయకులు అడ్డుకున్నారని స్పష్టం చేశారు. చంద్రబాబు, పవన్ వలంటీర్లపై కక్షకట్టారన్నారు. వలంటీర్ వ్యవస్థ కొనసాగాలంటే జగనన్న మళ్లీ సీఎం కావాలని చెప్పారు. సంతపేటలోని డంపింగ్ యార్డును మళ్లీ జగనన్న అధికారంలో రాగానే మార్పు చేస్తామని హామీనిచ్చారు. ఇక్కడ నవోదయ పాఠశాల ఏర్పాటు, మంగసముద్రం దళితవాడ అభివృద్ధి, మురకంబట్టు–సంతపేట రోడ్డును మరమ్మతు చేస్తామని హామీనిచ్చారు. కట్టమంచి రోడ్డును ఇటీవల అభివృద్ధి చేసినట్లు గుర్తు చేశారు. చిత్తూరులోని టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఎవరో మొన్నటివరకూ ప్రజలకు తెలియదన్నారు. కార్యక్రమంలో మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, నగర పార్టీ అధ్యక్షుడు జ్ఞానజగదీష్, టిమ్ము, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, సర్పంచ్ మధుసూదన్‌రాయల్, మాజీ కార్పొరేటర్ రాజేశ్వరి నాయకులు ద్వారక, అప్పాజీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లపై చంద్రబాబు కుట్ర



శైలజ

ఐరాల: వలంటీర్లపై చంద్రబాబు కుట్ర మరోసారి బయటపడిందని మహిళ, శిశు సంక్షేమ శాఖ రాయలసీమ రీజినల్ చైర్‌పర్సన్ శైలజ ఆగ్రహం వ్యక్తం చేశారు. అగరంపల్లెలో ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు ఉద్దేశపూర్వకంగా అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులను ఇక్కట్లకు గురిచేయడాన్ని ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని చెప్పారు. మొదట నుంచే చంద్రబాబు వలంటీర్ల వ్యవస్థపై విమర్శలు చేస్తున్నారని తాజాగా ఎలక్షన్ కమిషన్‌కి ఫిర్యాదు వేసి వలంటీర్లు పింఛన్ ఇవ్వకుండా చేశారని స్పష్టం చేశారు. జగనన్న ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా వలంటీర్లు కరోనా సమయంలో ప్రజలకు చేసిన సేవలను గుర్తుచేశారు. పేదవాడికి వచ్చే లబ్ధితో కూడా టీడీపీ కుటిల రాజకీయం చేస్తోందని మండిపడ్డారు. సిటిజన్ ఫర్ డెమోక్రసీ పేరుతో బాబు మనుషులు ఎలక్షన్ కమిషన్‌కి పిటిషన్ పెట్టి వలంటీర్లు పింఛన్ ఇవ్వకుండా చేశారన్నారు. వలంటీర్ వ్యవస్థపై చంద్రబాబు పూటకోమాట మాట్లాడుతున్నారని ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు.



సంతపేట ర్యాలీలో బైక్ నడుపుతున్న విజయానందరెడ్డి



నగరంలో మైనారిటీల బైక్‌ర్యాలీ

పెండింగ్ వారెంట్‌లపై బెయిల్ తీసుకోండి



రాసనపల్లెలో వారెంట్లపై మాట్లాడుతున్న సుబ్బరాజు

గుడిపాల: సారా కేసుల్లో పెండింగ్ వారెంట్లు ఉన్న తమ వద్ద లొంగిపోయి బెయిలే తీసుకోవాలని లేని పక్షంలో వారిపై తిరిగి కేసులు నమోదు చేస్తామని సెబ్ అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు తెలిపారు. మండలంలోని రాసనపల్లెలో ఆదివారం సారా తయారీతో పాటు, విక్రయాలు చేస్తున్న వారిపై గతంలో కేసులు నమోదు చేశామని వారందరిపై వారెంట్‌లు అలాగే ఉన్నాయని అందరూ వచ్చి బెయిల్ తీసుకోవాలన్నారు. లేకుంటే వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారెంట్లు ఉన్న ఇంటికి వెళ్లి వారి కుటుంబాల వారికి తగిన సూచనలు తెలియజేశారు.

ఘనంగా మహాభారత మహోత్సవం



మహాభారత నాటకాలతో గ్రామస్తులు

యాదమరి(పూతలపట్టు): యాదమరి మండలం లక్ష్మయ్య కండ్రిగలోని శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో ఆదివారం మహాభారతం మహోత్సవం ఘనంగా జరిగింది. మధ్యాహ్నం హరికథ కాలక్షేపం నిర్వహించగా , సాయంత్రం తెలుగునాటక ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామి వారిని గ్రామంలో ఊరేగించారు. విశేషపూజలు నిర్వహించారు.

పేదల సొంతింటి కల సాకారం

- అర్హులందరికీ పక్కా గృహాల మంజూరు
- జగనన్న లే అవుట్‌లో 43 నిర్మాణాలు పూర్తి
- లబ్ధిదారుల హర్షాతిరేకం



ఊరిని తలపిస్తున్న గుడిపాలలో జగనన్న లేఅవుట్

గుడిపాల: మండలంలోని వసంతాపురం సచివాలయం పరిధిలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత గుడిపాలలో జగనన్న లే అవుట్‌ను ఏర్పాటుచేసి ఇందులో 50 మందికి ఇంటి పట్టాలను మంజూరు చేసింది. 50 మందికి ఆనందోత్సాహాలతో ఇంటి పనులను ప్రారంభించారు. ఇందులో భాగంగా 43మంది ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకొని గృహ ప్రవేశాలు కూడా చేశారు.

ఒక్కో పట్టా రూ.5లక్షలు

మండల కేంద్రంలో ఇల్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం ఇంటి పట్టాలను అందజేసింది. చెన్నై–బెంగళూరు జాతీయ రహదారికి 100 మీటర్ల దూరంలోనే ఇల్లు లేని పేదలకు పట్టాలు ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణాలను శరవేగంగా ప్రారంభించి అందరూ ఇంటి నిర్మాణాలు కూడా చేపట్టారు.

ఊరు వెలిసింది

జగనన్న ఇంటి నిర్మాణాలు శరవేగంగా జరగడంతో మరో ఊరు వెలిసింది. ఇక్కడ విద్యుత్ సౌకర్యంతో పాటు తాగునీటి సదుపాయం కూడా ప్రతి ఇంటికీ కల్పించడం మరో విశేషం. ప్రస్తుతం ఇక్కడ విద్యుత్ కాంతులతో ఊరు వెలిగిపోతోంది. దీంతో వైద్య సిబ్బంది కూడా అక్కడికే వెళ్లి వైద్య సేవలను కూడా అందిస్తున్నారు. ఇల్లు లేని తమకు, బాడుగలు కట్టుకుంటున్న సమయంలో ముఖ్యమంత్రి ఇంటి పట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మించుకోవడంతో తమకు కూడా ఓ ఇల్లు ఉందన్న భరోసా కలిగిందన్నారు. ప్రస్తుతం ఈ ఇంటిని రిజిస్ట్రేషన్ కూడా చేయించి ఇవ్వడంతో పాటు పూర్తి హక్కులు కల్పించారు.



ఇంటి నిర్మాణాలు పూర్తిచేసి గృహ ప్రవేశాలు చేసిన ఇళ్లు

సొంతింటి కల నెరవేరింది




ఈ ప్రభుత్వ హయాంలో నాకు పక్కా ఇల్లు మంజూరైంది. ఇంటి నిర్మాణానికి కావలసిన సామగ్రి అందింది. ఇంటి నిర్మాణ బిల్లులు తన బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి. జీవితంలో ఇంత త్వరగా ఇల్లు నిర్మించుకుంటానని అనుకోలేదు. సొంతింటి కల నెరవేర్చిన ముఖ్యమంత్రికి ఎప్పటికీ రుణపడి ఉంటాం. **– రాజేశ్వరి, లబ్ధిదారు, గుడిపాల**

అవస్థలు తీరాయి



సొంత ఇల్లు లేక అద్దె ఇంట్లో జీవనం సాగిస్తూ అవస్థలు పడే వాళ్లం. ప్రస్తుత ప్రభుత్వ హయంలో మాకు పక్కా ఇల్లు మంజూరైంది. ఇంటి నిర్మాణాలు చేపట్టి కూడా గృహప్రవేశం చేసుకున్నాం. తమకు సొంతంగా ఇల్లు ఉందని చాలా గర్వంగా ఉంది. ఈ సీఎం మేలును ఎప్పటికీ మరువలేం. **– శోభ, లబ్ధిదారు, గుడిపాల**

కేంద్ర బలగాల కవాతు



కవాతు చేస్తున్న కేంద్ర బలగాలు

ఐరాల: గ్రామాల్లో ఎక్కడా అల్లర్లు జరగకుండా ప్రతి ఒక్కరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని కాణిపాకం ఇన్‌చార్జి ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి సూచించారు. మరి కొద్ది రోజు ల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాణిపాకం పంచాయతీ గ్రామాల్లో ఇన్‌చార్జి ఎస్‌ఐ, కేంద్ర బలగాలతో కలిసి ఆదివారం కవాతు నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ప్రజలందరూ ధైర్యంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

విశ్వ బ్రాహ్మణుల ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న దయానందచ్చారి

గుడిపాల: నరాల వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థికసాయాన్ని అందించారు. చిత్తూరు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు దయానందచారి ఆధ్వర్యంలో ఆదివారం మండలం ఎగువ పిళ్లారికుప్పంలోని భాస్కరాచ్చారి కుమారుడు సూరి (19) డిగ్రీ సెకండియర్ చదువుతున్నాడు. నరాల వ్యాధితో బాధపడుతున్న సూరి ప్రస్తుతం సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇంజక్షన్లకు ప్రతి రోజూ వేల రూపాయలు ఖర్చు అవ్వడంతో చిత్తూరుజిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో రూ.33,416ను సూరి తల్లిదండ్రులకు వారు అందజేశారు. కార్యక్రమంలో కార్యవర్గ నాయకులు బాల ఆచ్చారి, త్యాగరాజాచ్చారి, విజయ ఆచ్చారి, ఉమాశంకరాచ్చారి, చంద్రశేఖర్ ఆచ్చారి పాల్గొన్నారు.

సోషియల్ ఉపాధ్యాయుడి సేవలు మరువలేనివి



సన్మాన సభలో జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజు

పూతలపట్టు: మండలంలోని యం.బండపల్లి ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించిన చంద్రశేఖర్ నాయుడి సేవలు మరవలేనివని జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజు తెలిపారు. చంద్రశేఖర్ ఉద్యోగ విరమణ సందర్భంగా వీడ్కోలు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. విధి నిర్వహణలో చురుగ్గా పాల్గొంటూ అందరితో స్నేహంగా ఉంటారని డీవైఈఓ చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు కృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రుషేంద్రకుమార్, భాస్కర్ నాయుడు, ప్రధానోపాధ్యాయులు దామోదర నాయుడు, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు త్యాగరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఏసు పునరుత్థాన దినం

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలో పుణ్యప్రదమైన ఈస్టర్ (ఏసు పునరుత్థాన దినోత్సవం)ను ఆదివారం క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. నగరంలోని టౌన్‌చర్చి, సెయింట్ లూక్ చర్చి, బీటీ మెమోరియల్ చర్చి, జాన్‌బాస్కో చర్చి, హోసన్నా మందిరాల్లో ఉదయం నుంచి ఆరాధన కార్యక్రమాలు ప్రారంభయయ్యాయి. మత పెద్దలు ఈస్టర్ పర్వదినాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. బైబిల్ సూక్తులను చదివి వినిపించారు. ఏసుక్రీస్తు మరణించి, మళ్లీ జన్మించిన రోజు ఎంతో పవిత్రమైందన్నారు. దేవుని వ్యాఖ్యలను అనుసరించి, సన్మార్గంలో నడవలన్నారు. పదిమందికి మంచి చేయాలే తప్ప చెడు చేయకు అని వివరించారు. దేవుని దృష్టిలో అందరూ సమానులేనన్నారు. ప్రతి ఒక్కరూ శాంతియుతంగా జీవించాలన్నారు. పరస్పరం కష్ట, సుఖాల్లో పాలుపంచుకోవాలని చెప్పారు. ముందుగా భక్తిగీతాలు ఆలపించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలు చర్చిల్లో చిన్నారులు వేసిన నాటిక సన్నివేశాలు ఆకట్టుకున్నాయి.



చిత్తూరు: హోసన్నా మందిరంలో జరిగిన ప్రత్యేక పార్థనలో క్రైస్తవులు

ఈస్టర్ వేడుకలు

గుడిపాల: మండలంలోని చిత్తపార చర్చిలో జరిగిన ఈస్టర్ వేడుకలకు చిత్తూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి హాజరయ్యారు. చర్చి పాస్టర్‌లు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఆయా చర్చిల్లో పాస్టర్లు మాట్లాడుతూ ప్రభువైన ఏసు మూడవదినం తిరిగి లేవడం ద్వారా మానవులకు ఆత్మరక్షణ కలిగిందన్నారు. ఏసుక్రీస్తు ప్రభువు పునరుత్థానమును జ్ఞాపకము చేసుకొని ఆరాధించారు.అనంతరం యువతీ, యువకులు గీతాలాపన చేశారు. అనంతరం కొన్ని చర్చిల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ప్రత్యేక ఆరాధనలు

పూతలపట్టు: మండలంలో ఆదివారం క్రైస్తవులు ఈస్టర్ వేడుకలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. అనంతాపురం, సామనత్తం, వసంతాపురం, చిటిపిరాళ్ల, రంగంపేట క్రాస్, పూతలపట్టు చర్చిల్లో ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. కొవ్వొత్తులు వెలిగించుకొని, ర్యాలీలు చేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.





చిత్తూరు: సందేశమిస్తున్న టౌన్‌చర్చి పాస్టర్, ఆలకిస్తున్న క్రైస్తవులు



గుడిపాల: చర్చిలో నిర్వహించిన ఈస్టర్ వేడుకలకు హాజరైన భక్తులు





ఈస్టర్ ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు, ప్రసంగిస్తున్న చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి